సాక్షి
కుమురం భీం
మంగళవారం । 16 । మే । 2023



నేటి నుంచి 'దోస్త్'

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం నుంచి దోస్త్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రవేశ ప్రక్రియ మూడు విడతలుగా నిర్వహించనున్నారు. 8లో▸



సమస్యలు చర్చకు వచ్చేనా..?

ఆరు నెలల అనంతరం కౌటాల మండల సర్వసభ్య సమావేశం జరుగనుంది. సమస్యలపై చర్చించాలని ప్రజలు కోరుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
41.7 /28.5

వాతావరణం

ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. పొద్దంతా ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విజేతలకు ఘన స్వాగతం



క్రీడాకారులతో కొత్తపల్లి అనిత

కాగజ్‌నగర్‌టౌన్: భూటాన్‌లో జరిగిన బేస్‌బాల్ అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపి, గోల్డ్ మెడల్ సాధించిన రేకల తనిష్క్, సహస్రమాల, ఇతర క్రీడాకారులను బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ కొత్తపల్లి అనిత ఘన స్వాగతం పలికారు. సోమవారం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న విజేతలకు స్వీట్లు తినిపించి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే వెనుకబడిన కుమురంభీం జిల్లాలోని తుంపల్లి గ్రామానికి చెందిన రేఖల తిరుపతి–సునీత దంపతుల కుమారుడు రేకల తనిష్క్‌తో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన సహస్రమాల గోల్డ్ మెడల్ సాధించడం మన రాష్ట్రానికే గర్వకారణమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్ బేస్‌బాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం గురవేందర్, శైలజ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం



కాగజ్‌నగర్‌లో విద్యార్థి వివరాలు తెలుసుకుంటున్న అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాలల్లో సౌకర్యాల గురించి వివరిస్తూ దరఖాస్తులు తీసుకున్నారని పేర్కొన్నారు. మొదట ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకుని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలు బోర్డు నిర్దేశించిన పరిమితికి లోబడి అడ్మిషన్లు తీసుకోవాలని ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మెమో, టీసీ, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు.

డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలి



ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, వైద్యారోగ్యశాఖ అధికారులు

ఆసిఫాబాద్: జిల్లాలో డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. ఈ నెల 16న జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో కలసి ఫ్లెక్సీ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. వ్యాధి నిర్మూలనకు దోమల వ్యాప్తిని నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రామకృష్ణ, డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ దుర్గం కళావతి మాట్లాడుతూ గతేడాది అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు నేటివరకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదన్నారు. అకాల వర్షాలతో జిల్లాలో వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నా వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేపట్టడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్సుకోల సరస్వతి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు లచ్చన్న, పెంటయ్య, హన్మంతు, మహేశ్, పోచన్న పాల్గొన్నారు.

క్రీడా సంబురాలు



గోలేటిలోని శిబిరంలో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

- ఓ వైపు వేసవి క్రీడా శిబిరాలు.. మరోవైపు సీఎం కప్ పోటీలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు
- గ్రామీణ క్రీడాకారులకు వరంగా సీఎం కప్ పోటీలు

రెబ్బెన/ఆసిఫాబాద్‌రూరల్: ఓ వైపు వేసవి క్రీడా శిబిరాలు, మరో వైపు సీఎం కప్ పోటీల నిర్వహణతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఇప్పటికే జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు మండల స్థాయిలో సీఎం కప్ పోటీలు మొదలయ్యాయి. విద్యార్థులతోపాటు 15 నుంచి 36 ఏళ్ల లోపు యువత క్రీడల్లో సత్తా చాటుతున్నారు. ఒకేసారి క్రీడలకు సంబంధించి రెండు కార్యక్రమాలను వేసవి సెలవుల్లోనే చేపట్టడంతో జిల్లా క్రీడాకారులు పట్టరాని సంతోషంతో ఉన్నారు. వివిధ రకాల క్రీడల్లో శిక్షణ అందించేందుకు ఈ శిబిరాలను ప్రారంభించారు.

'సీఎం కప్'తో మరింత ఉత్సాహం

వేసవి సెలవులతో ఇళ్లల్లో బోర్‌గా ఫీలవుతున్న క్రీడాకారులకు సీఎం కప్ పోటీలు నూతన ఉత్సాహం నింపుతున్నాయి. గ్రామీణ క్రీడాకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మూడంచెల్లో వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ నెల 31 వరకు సీఎం కప్ పోటీలు కొనసాగనున్నాయి. సోమవారం నుంచి కొనసాగుతున్న మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో యువత ఆసక్తిగా పాల్గొంటున్నారు. మండల, జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటేందుకు క్రీడాకారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం పోటీలపై ప్రత్యేక దృష్టి సారించింది. పెద్దఎత్తున యువత పాల్గొనేలా చర్యలు చేపట్టింది. పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఆసక్తి గల క్రీడాకారుల పేర్లు నమోదు చేస్తున్నారు.

11 శిక్షణ కేంద్రాలు..

జిల్లాలో ఈ నెల 1 నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 10 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా చెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఒక శిక్షణ శిబిరాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఎనిమిది రకాల క్రీడల్లో శిక్షణ అందించేందుకు అనుభవజ్ఞులైన శిక్షకులను నియమించారు. రెబ్బెన మండలం గోలేటిలో యోగా, బాల్‌బ్యాడ్మింటన్, కాగజ్‌నగర్‌లో సాఫ్ట్‌బాల్, బాక్సింగ్, యోగా, జిల్లా కేంద్రంలో కబడ్డీ, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, తిర్యాణి మండల కేంద్రంలో వాలీబాల్, సిర్పూర్(యూ)లో కబడ్డీ శిక్షణ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ నెలఖారు వరకు కొనసాగే ఈ కేంద్రాల ద్వారా దాదాపు 600 మంది క్రీడాకారులు మెలకువలు నేర్చుకుంటున్నారు.



కాగజ్‌నగర్‌లో బాక్సింగ్ శిబిరం

యోగా నేర్పిస్తున్నారు



ఆరోగ్య రక్షణకు యోగా అవసరంగా మారింది. యోగాతో మానసికోల్లాసం కలుగుతుంది. క్రీడలతో శరీరం ఫిట్‌గా ఉంటుంది. క్లాస్‌రూం నుంచి బయటికి వచ్చి ఇలా గేమ్స్ ఆడటం సంతోషంగా ఉంది.

– సరయు, ఏడో తరగతి, కాగజ్‌గర్

పట్టు పెంచుకుంటున్నా..



కబడ్డీ నాకు చాలా ఇష్టమైన ఆట. సమ్మర్ క్యాంపులో మా వ్యాయమ టీచర్ తిరుపతి కబడ్డీలో బేసిక్స్ నేర్పిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు గంటల పాటు శిక్షణ కొనసాగుతోంది. ఆటపై మరింత పట్టు పెంచుకుంటున్నా.

– చరణ్, తొమ్మిదో తరగతి, ఆసిఫాబాద్

ఉత్సాహంగా పాల్గొంటున్నారు



జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో భాగంగా గోలేటిలో యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. యోగా నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం ద్వారా యోగా నేర్చుకున్న పలువురు క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి పతకాలు సాధించారు.

– కేసరి అలేఖ్య, యోగా కోచ్

ఈ నెలాఖరు వరకు కొనసాగిస్తాం



జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను ఈ నెలాఖరు వరకు కొనసాగిస్తాం. ఐదు మండలాల్లో ఎనిమిది క్రీడలతో 10 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఉదయం, సాయంత్రం కోచ్‌ల ద్వారా శిక్షణ అందిస్తున్నాం. విద్యార్థులు, క్రీడాకారులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.

– మణెమ్మ, జిల్లా క్రీడల అధికారి

యువత ఉత్సాహంగా పాల్గొనాలి



రెబ్బెన: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అట్టహాసంగా సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం

రెబ్బెన(ఆసిఫాబాద్): సీఎం కప్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో సోమవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. సీఎం కప్ పోటీలు ఈ నెల 31 వరకు కొనసాగుతాయని తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జిల్లా స్థాయికి, అక్కడ సత్తా చాటితే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం అందజేస్తుందని పేర్కొన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం పోటీలు నిర్వహించాలని సూచించారు.

స్విమ్మింగ్‌పూల్, షటిల్ కోర్టు పరిశీలన

జిల్లా స్థాయి స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణ కోసం గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్ ఆవరణలోని స్విమ్మింగ్‌పూల్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వుడెన్ షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, తహసీల్దార్ మల్లికార్జున్, సీఐ అల్లం నరేందర్, గోలేటి సర్పంచ్ పోటు సుమలత, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పులికుంట సర్పంచ్ పోషమల్లు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంజద్‌పాషా, పీఈటీ భాస్కర్, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సీఎం కప్ మండల స్థాయి పోటీలను సోమవారం ప్రారంభించారు. విజయవంతంగా పోటీలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీడీవో మణెమ్మ, ఎంపీపీ మల్లికార్జున్, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, పీడీ, పీఈటీలు రాకేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వట్టివాగు డైవర్షన్ పనులు పూర్తి చేయాలి



డైవర్షన్ పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఖైరిగూడ ఓసీపీ విస్తరణలో భాగంగా చేపట్టిన వట్టివాగు రెండో డైవర్షన్ పనులు త్వరగా పూర్తిచేయాలని సింగరేణి డైరెక్టర్(పీ అండ్‌పీ) వెంకటేశ్వరరెడ్డి ఏరియా అధికారులను ఆదేశించారు. సోమవారం జీఎం దేవేందర్‌తో కలిసి బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఓసీపీ క్వారీతో పాటు వట్టివాగు రెండో డైవర్షన్ పనులను పరిశీలించారు. ఖైరిగూడ ఓసీపీలో ఉత్పత్తి ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత, సివిల్ పనులపై గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలోగా సివిల్ పనులు, కట్టల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో ఏరియాకు నిర్దేశించిన లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమాల్లో ఎస్‌వోటూజీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం సివిల్ సతీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవెలేబుల్ పాఠశాలల్లో ప్రవేశాలు

ఆసిఫాబాద్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవెలేబుల్ పాఠశాలల్లో 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 18 నుంచి జూన్ 2 వరకు దరఖాస్తులు జిల్లా కేంద్రంలోని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 7న ఉదయం 10 గంటలకు గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు పరిశీలించి, లక్కీడ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ మీడియాన్ని ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఆరు సీట్లు పీటీజీ తెగకు, ఆరు సీట్లు ఏజెన్సీ గ్రామాలకు చెందిన విద్యార్థులకు, 48 సీట్లు అన్ని గిరిజన తెగల విద్యార్థులకు రిజర్వేషన్ ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు కుల, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల జిరాక్సు పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జత చేయాలని సూచించారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

- అదనపు కలెక్టర్ రాజేశం
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అర్జీ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్: అన్నిశాఖల సమన్వయంతో ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవో రాజేశ్వర్ కలిసి సోమవారం వివిధ మండలాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెబ్బెన మండలం తుంగెడలో గతంలో తమ తండ్రి కొనుగోలు చేసిన భూమిని తమదే అంటూ భూమి విక్రయించిన వ్యక్తి కొలతలు వేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, సత్వరమే న్యాయం చేయాలని ఏల్పుల నాగయ్య, గంగయ్య, పోచయ్య, హనుమంతు దరఖాస్తు చేసుకున్నారు. తమ భూమిని కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించుకుని, ఇల్లును కూలగొట్టారని న్యాయం చేయాలని కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన బడికిల దుర్గయ్య అర్జీ సమర్పించాడు. కూలీ పనిచేసుకునే తనకు జిల్లా కేంద్రం స్థలం ఉందని, ప్రభుత్వం నుంచి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కోరుతూ అంబేడ్కర్ నగర్‌కు చెందిన జాడి రమాదేవి, రాంటెంకి నిర్మల అదనపు కలెక్టర్‌కు విన్నవించారు. వీరితోపాటు పలువురు సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతిభవన్ ముట్టడి



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న వీవోఏలు

- వీవోఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేందర్
- కలెక్టరేట్ ఎదుట సామూహిక నిరాహార దీక్షలు

ఆసిఫాబాద్: సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ ముట్టడిస్తామని వీవోఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. ఉద్యోగ భద్రత కోసం వీవోఏలు చేపట్టిన సమ్మె సోమవారం 29వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. రాజేందర్ మాట్లాడుతూ తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా నిరవధిక సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. సమ్మె విచ్ఛిన్నానికి కొందరు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో సామూహిక నిరాహార దీక్ష ప్రారంభించామని, ఈ నెల 22న చలో హైదరాబాద్ ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ జ్యోతి, రాష్ట్ర నాయకులు సునీత, మండల కార్యదర్శి రమాదేవి, కల్పన, జయ, ఫైమా, శ్రీలక్ష్మి, శారద, సరిత, సురేఖ, సుధీర్, వినోద్, ఓమాజీ, వినోద్, భీమ్‌రావు, ధర్మరాజు, రమేశ్, శంకర్, గణేశ్, జైవంత్ పాల్గొన్నారు.

అక్రమాలకు అడ్డాలు.. ట్రాన్స్‌పోర్టులు

- ఇతర రాష్ట్రాల నుంచి కాగజ్‌నగర్‌కు నిషేధిత ఉత్పత్తుల దిగుమతి
- నకిలీ వస్తువులకు కేరాఫ్‌గా నిలుస్తున్న పట్టణం
- తనిఖీలు లేక రెచ్చిపోతున్న అక్రమార్కులు



పట్టణంలోని ఓ ట్రాన్స్‌పోర్టులో దాచిఉన్న సంచులు



ప్లాస్టిక్ ఉత్పత్తులను తరలిస్తున్న ట్రాలీ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కొన్ని ట్రాన్స్‌పోర్టులు నిషేధిత వస్తువుల అక్రమ రవాణాకు అడ్డాలుగా మారాయి. ధనార్జనే ధ్యేయంగా అధికారుల కళ్లు కప్పి గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వం నిషేధించిన పలు వస్తువులను పట్టణానికి చేరవేస్తున్నారు. సమీప మండలాల్లోని ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారికి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

జోరుగా దందా..

హైదరాబాద్, వరంగల్, నాగ్‌పూర్, చంద్రపూర్, రాయ్‌పూర్, గోందియా, బిలాస్‌పూర్, బీదర్ తదితర ప్రాంతాల నుంచి ట్రాన్స్‌పోర్టుల ద్వారా అక్రమార్కులు ఆయా ఉత్పత్తులను దిగుమతి చేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి స్థానికంగా కొందరు ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు సహకరించడంతో కాగజ్‌నగర్ ప్రాంతంలో నిషేధిత ఉత్పత్తుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్, నాగ్‌పూర్ పట్టణాల నుంచి కాగజ్‌నగర్‌కు డైలీ సర్వీస్‌లు నడుపుతున్న కొన్ని ట్రాన్స్‌పోర్టుల నిర్వాహకులు డబ్బు ఆశతో నిషేధిత ఉత్పత్తులను నేరుగా కాగజ్‌నగర్‌లో డెలివరీ ఇస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్, నాగ్‌పూర్ వంటి నగరాల్లోని ఆయా ట్రాన్స్‌పోర్టుల కార్యాలయాలకు అక్కడి వ్యాపారులు బ్యాగులు, గోనె సంచుల్లో నిషేధిత ఉత్పత్తులను పంపిస్తుంటారు. ట్రాన్స్‌పోర్టుల్లో ఎలాంటి ఆధారాలు లేకుండానే బ్యాగులను బుక్ చేస్తున్నారు. బుకింగ్ చేసే వ్యక్తి నుంచి బ్యాగుల పార్సిల్ తీసుకునే వ్యక్తి వరకు బోగస్ పేర్లు పెట్టి దందా సాగిస్తున్నారు.

రహస్యంగా గోదాంలకు తరలింపు..

ట్రాన్స్‌పోర్టుల ద్వారా ముఖ్యంగా నిషేధిత గడ్డి మందు, నకిలీ పత్తి విత్తనాలు, స్పటిక, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నకిలీ సిగరెట్లు, తెలంగాణలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు, చైనా మాంజా తదితర వస్తువులను అక్రమార్కులు కాగజ్‌నగర్‌కు తరలిస్తున్నారు. హైదరాబాద్, నాగ్‌పూర్ నుంచి రాత్రి 10, 11 గంటల సమయంలో ట్రాన్స్‌పోర్టు లారీలు సరుకుతో కాగజ్‌నగర్‌కు బయలుదేరుతున్నాయి. తెలవారుజామున ఆరు గంటల లోగా ట్రాన్స్‌పోర్టుల ఎదుట నిర్వాహకులు చిన్న వాహనాలతో ఉత్పత్తులను రహస్యంగా గోదాంలకు తరలిస్తున్నారు. స్థానికులకు అనుమానం రాకుండా సరుకు తరలించే ప్రక్రియను ఉదయం 7 గంటల వరకు పూర్తి చేస్తున్నారు. వస్తువుల దిగుమతికి ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు అక్రమార్కుల నుంచి భారీ కిరాయి వసూలు చేస్తున్నట్లు సమాచారం.

బుకింగ్ ప్రక్రియ సులభతరం

ట్రాన్స్‌పోర్టు ప్రధాన కార్యాలయాల్లో బుకింగ్ ప్రక్రియ సులభతరంగా ఉండటం అక్రమార్కులకు కలిసి వస్తోంది. దర్జాగా బోగస్ పేర్ల మీద బుకింగ్ చేస్తూ ఉత్పత్తులను కాగజ్‌నగర్‌కు తరలిస్తున్నారు. కొన్ని ట్రాన్స్‌పోర్టుల్లో కేవలం రిక్షా ద్వారా నిషేధిత వస్తువులు పంపి ఫలానా వ్యక్తి పేరు మీద కాగజ్‌నగర్‌కు బుక్ చేయాలని చెప్పినా పని కానిస్తున్నట్లు సమాచారం. అక్రమార్కులు వారి పేర్లు బయటకు రాకుండా జాగ్రత్తలు పడుతున్నారు. ఒకవేళ వస్తువులు పట్టుబడినా తమకు సంబంధం లేదని పోలీసుల నుంచి తప్పించుకుంటున్నారు.

నిఘా పెంచుతాం



ప్రభుత్వ నిషేధిత ఉత్పత్తులు, ఊరు– పేరు, సరైన పత్రాలు లేని ఇతర వస్తువులు ట్రాన్స్‌పోర్టుల ద్వారా దిగుమతి చేస్తే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తాం. గతంలో పలువురు ట్రాన్స్‌పోర్టు యజమానులపై కేసు నమోదు చేసి వాహనాలను సైతం సీజ్ చేశాం. ఇప్పటికే వారికి పోలీసులకు సహకరించాలని సూచించాం. ట్రాన్స్‌పోర్టులపై నిరంతరంగా నిఘా పెంచుతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– బుద్దే స్వామి, సీఐ, కాగజ్‌నగర్‌టౌన్

క్లుప్తంగా

దాడి కేసులో ఒకరికి ఏడాది జైలు

కాసిపేట(బెల్లంపల్లి): దాడి కేసులో బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ముఖేష్ ఒకరికి ఏడాది జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్‌కు చెందిన గోపతి భూమయ్య 2017 ఫిబ్రవరి 8న ట్రాన్స్‌ఫార్మర్ విషయమై అతని తమ్ముడు గోపతి రామయ్యను డబ్బులు అడగడంతో ఇనుపరాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. భూమయ్య ఫిర్యాదుతో రామయ్యపై కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై తాళ్ల శ్రీకాంత్ విచారణ జరిపించి నిందితుడిని అరెస్టు చేశారు. 9 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో సోమవారం శిక్ష ఖరారు చేశారు.

ఓసీపీల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి



సమీక్షలో పాల్గొన్న అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): వర్షాకాలం సమీపిస్తున్నందువల్ల ఓసీపీల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని కంపెనీ డైరెక్టర్లు సూచించారు. సోమవారం కొత్తగూడెం నుంచి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్), డీ.సత్యనారాయణ(ఈఅండ్‌ఎం) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీరాంపూర్ నుంచి ఏరియా ఇన్‌చార్జి జీఎం ఎం.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగనున్న నేపథ్యంలో వేసవిలోనే అధిక బొగ్గు తీయాలన్నారు. 15 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, ఓసీపీ పీవో పురుషోత్తం రెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, డీజీఎంలు చిరంజీవులు, చంద్రశేఖర్‌రెడ్డి, క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1 గ్రామం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. బాపునగర్ గ్రామానికి చెందిన గోలేటి సునీల్ కాగజ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌కు హాజరై ఇంటికి వెళ్తుండగా బైక్‌పై ఎదురుగా వచ్చిన నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1 గ్రామానికి చెందిన శివ బిశ్వాస్ ఢీకొనడంతో సునీల్‌కు గాయాలయ్యాయి. బాధితుడి తండ్రి గోలేటి బాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు.

బాలికపై అత్యాచారానికి యత్నించిన ఒకరిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.5 గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన సంజయ్ బిశ్వాస్ విలేజ్ నెం.5లోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఎదురింట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక అరవడంతో చుట్టుపక్కల వారు రావడాన్ని గమనించిన సంజయ్ పరారయ్యాడు. ఈమేరకు బాలిక తల్లి బిషుకా మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.



నేటి నుంచి దోస్త్

- డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్
- ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు
- మూడు విడతలుగా ప్రక్రియ
- జూలై 17 నుంచి తరగతులు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్/బోథ్: 2023-24 విద్యాసంవత్సరంలో డిగ్రీలో ప్రవేశానికి చేపట్టే (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) దోస్త్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. విద్యార్థులకు ఇష్టమైన కళాశాల, నచ్చిన కోర్సు ఎంచుకునేందుకు వీలు కల్పించారు. ప్రవేశ ప్రక్రియ మూడు విడతలుగా జరుగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత మండలి చైర్మన్, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ దోస్త్ నోటిఫికేషన్, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు ప్రకటించారు. మే 16 నుంచి జూన్ 10 వరకు మొదటి విడత రిజిస్ట్రేషన్లు షురూ కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు 137 ఉన్నాయి. ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లాలో 6,470 మంది, మంచిర్యాల జిల్లాలో 4,656 మంది, నిర్మల్ జిల్లాలో 3,979 మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 3,973 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒక్కో కళాశాలలో ఒక్కో కోర్సుకు 60 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఎం, కంప్యూటర్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈసారి రాష్ట్రంలోని 11 కళాశాలల్లో కొత్తగా బీఎస్సీ ఆనర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ పేరిట నాలుగేళ్ల కోర్సు ప్రారంభిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఏయే కళాశాలల్లో కొత్త కోర్సుకు అనుమతి ఉంటుందో దోస్త్ ప్రక్రియ ప్రారంభమైతేగానీ తెలియని పరిస్థితి.

ఇంట్లో నుంచే దరఖాస్తు

డిగ్రీలో ప్రవేశం పొందగోరే విద్యార్థి ఇంట్లో నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ అనుసంధానం చేసిన స్మార్ట్‌ఫోన్ ఉంటే దానితో నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలా కుదరనిపక్షంలో తల్లిదండ్రుల ఫోన్లకు విద్యార్థి తన ఆధార్‌ను అనుసంధానించి ప్రక్రియను కొనసాగించే అవకాశం కల్పించారు. ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉంటే విద్యార్థి ఇంట్లో కూర్చునే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. టీయాప్ ఫోలియో మొబైల్ యాప్ ద్వారా సులువుగా రిజిస్టర్ చేసుకునే సదుపాయం కల్పించారు. వివరాలు పూర్తి చేసిన తర్వాత విద్యార్థి సెల్‌ఫోన్‌కు ఓటీపీ (వన్‌టైం పాస్‌వర్డ్) సమాచారం వస్తుంది.

సీట్లు భర్తీ అయ్యేనా?

గతేడాది ఐదు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించినా సగానికి పైగా సీట్లు భర్తీ కానీ గడ్డు పరిస్థితి. ప్రభుత్వ కళాశాలల్లో కాస్త మెరుగ్గా ఉన్నా ప్రైవేట్ కళాశాలల్లో సీట్లు మిగిలిపోవడం నిరాశ పరిచింది. నాలుగు ప్రభుత్వ కళాశాలల్లో 1,920 సీట్లకుగానూ 807 సీట్లు మిగిలిపోయాయి. జిల్లాలో డిగ్రీ ప్రవేశాల సంఖ్య తగ్గడానికి ఇంటర్ ఉత్తీర్ణత శాతం తగ్గిపోవడం కారణమైతే.. విద్యార్థులకు హైదరాబాద్ నగరంపై మోజు ఉండడం మరో కారణం. ఒకప్పుడు ఇంజినీరింగ్ విద్య కోసం రాష్ట్ర రాజధానిపై ఆసక్తి కనబర్చి బీటెక్ కోర్సులు అక్కడ చదవడం ప్రారంభించారు. మరోవైపు వసతితో కూడిన విద్య అమలు చేస్తుండడంతో గురుకులాల్లో కూడా డిగ్రీ ప్రవేశపెట్టడంతో కూడా కొంతమేర ప్రవేశాలు తగ్గినట్లు చెబుతున్నారు. ప్రైవేట్‌లో 40శాతం సీట్లు కూడా భర్తీకాని పరిస్థితి ఏర్పడింది. దోస్త్ వచ్చిన తర్వాత విద్యార్థులు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవడం చాలా తేలికైంది. మరోవైపు అవసరానికి మించి కోర్సులు.. సీట్లు ఉన్నాయి. ప్రధానంగా ప్రైవేట్‌లో అత్యధికంగా ఇలాంటివే. ఒకరిని చూసి మరొకరు అన్నట్లు సీట్లను పెంచుకుంటూ వచ్చారు. దీంతో సీట్లు భర్తీకాక డిగ్రీ కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారుతోంది. మంచిర్యాల జిల్లాలో 22 కళాశాలల్లో ఒకటి, రెండు మూసివేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

దరఖాస్తు విధానం

దోస్త్‌లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో పదోతరగతి, ఇంటర్ మెమోలు, 1 నుంచి పదోతరగతి వరకు బోనఫైడ్, కండక్ట్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టుసైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, ఆధార్ అనుసంధానం సెల్‌నంబర్, ఈ ఏడాది తీసుకున్న కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కళాశాలలు, కోర్సుల్లో ప్రవేశానికి నమోదు చేసుకోవడానికి మొదటి విడతలో రూ.200 చెల్లించాలి. క్రెడిట్, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, టీవ్యాలెట్ ద్వారా చెల్లించవచ్చు.

మూడు విడతలుగా...

మొదటి విడత ఈ నెల16 నుంచి జూన్ 10వరకు రిజిస్ట్రేషన్, ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు, జూన్ 16న సీట్ల కేటాయింపు, 16నుంచి 25 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం ఉంటుంది. రెండో విడత జూన్ 16 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్లు, 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. మూడో విడత జూలై 1నుంచి 5 వరకు రిజిస్ట్రేషన్, 1నుంచి 6వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు, 10న సీట్ల కేటాయింపు ఉంటుంది.

వరికోత మిషన్‌లో మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జన్నారం(ఖానాపూర్): జన్నారం మండలంలోని రాంపూర్‌లో వరి కోస్తుండగా మిషన్‌లోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కాటం దేవేందర్ వరిపొలంలో సోమవారం మధ్యాహ్నం హార్వెస్టర్‌తో పంటను కోస్తుండగా మిషన్‌లోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే కిందకు దూకి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతోనే మంటలు వచ్చినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. ప్రమాదంలో హార్వేస్టర్ పైనున్న ట్రాక్టర్ భాగం పూర్తిగా కాలిపోయింది.

ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: ఆరోగ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యాక్సినేషన్, కంటి వెలుగు కార్యక్రమాలు విజయవంతం చేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని అన్నారు. గుండె వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే నిధులను సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు రమేశ్, దివ్య, ఉష, నాగమణి, రత్నమాల, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

యువకుడి హత్యకేసులో నిందితుల అరెస్ట్


- వివరాలు వెల్లడించిన డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ

మందమర్రిరూరల్(చెన్నూర్): ఇటీవల మందమర్రిలో జరిగిన సాగర్ హత్యకేసులో నిందితులు బొడ్డు బాలాజీ, నూనె వెంకటేశ్, అల్లంకుంట గణేశ్, బోగ వెంకటేశ్‌లను అరెస్టు చేసినట్లు డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ సదయ్యతో కలిసి హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గతంలో దీపక్‌నగర్‌లోని వాటర్ ప్లాంట్ సమీపంలో ఉంటున్న ఒక అమ్మాయితో సాగర్ చనువుగా ఉండేవాడు. ఈ నెల 12న రాత్రి పల్సర్‌పై యువతి ఇంటికి రావడాన్ని గమనించిన బాలాజీ, వెంకటేశ్ మరో ఇద్దరికి సమాచారం అందించారు. నలుగురూ కలిసి యువతి ఇంటికి వెళ్లగా వారిని గమనించిన సాగర్ పారిపోతుండగా పట్టుకుని తీవ్రంగా కొట్టారు. అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో ప్రమాదంలో గాయపడ్డాడని చెప్పి మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వెళ్లిపోయారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు. 13న మృతుని తండ్రి తారాచంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మహేందర్‌రెడ్డి నలుగురు నిందితులను అరెస్టు చేసి 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. హత్య కేసు ఛేదించిన సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్, హెడ్ కానిస్టేబుల్ అజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు సంపత్, మహేష్, అనిల్‌కుమార్, రాము, సురేందర్‌ను డీసీపీ అభినందించారు.

'బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి'



నిరసన తెలుపుతున్న పీవోడబ్ల్యూ నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): జాతీయ స్థాయి మహిళా రెజ్లర్లను వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పీవోడబ్ల్యూ నాయకురాళ్లు సోమవారం షిర్కే చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు శోభ, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ నేరస్తులకు బీజేపీ సర్కార్ కొమ్ము కాస్తుందన్నారు. ఎంపీపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. న్యాయం కోసం జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తే అక్రమంగా అరెస్టు చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీ.రాజేందర్, శంకర్, అనిల్, అప్పారావు, తిరుమల, శారద, రాజమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

యోగా మహోత్సవం విజయవంతం చేయాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌వోటూ జీఎం గుప్తా

రెబ్బెన(ఆసిఫాబాద్): హార్ట్‌ఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీరామ చంద్రమిషన్, సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఏరియాలో నిర్వహిస్తున్న హర్‌దిల్ ధ్యాన్, హర్ దిన్ ధ్యాన్ యోగా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎస్‌వోటూ జీఎం కేహెచ్ఎన్ గుప్తా కోరారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మహోత్సవంలో భాగంగా మూడు రోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు, ధ్యాన్యంపై నిపుణులతో శిక్షణ ఇప్పించి, యోగా ధ్యానం ప్రతిఒక్కరి జీవితంలో భాగస్వామ్యం అయ్యేలా కృషి చేస్తున్నామన్నారు.

అవమానంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

- సోషల్ మీడియాలో వీడియో వైరల్



వినయ్(ఫైల్)

దండేపల్లి(మంచిర్యాల): ఏతప్పూ చేయని తనతో ఎవరూ మాట్లాడడంలేదని, తనను హంతకుడిలా చూస్తున్నారని అవమానభారంతో ఓ యువకుడు సోమవారం గడ్డి మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలోని కొత్తమామిడిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నలిమెల వినయ్ ఆత్మహత్యాయత్నానికి ముందు విడుదల చేసిన వీడియోల్లో తన ఆవేదన వెల్లగక్కాడు. గత మార్చి 18న అదే గ్రామానికి చెందిన ఎంబడి సాయిష్మా గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు తానే కారణమని యువతి కుటుంబ సభ్యులు తనపై కేసులు పెట్టించి జైలుకు పంపించారు. ఇటీవల జైలు నుంచి విడుదలై వచ్చిన తనతో గ్రామస్తులెవరూ మాట్లాడక పోవడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశాడు. యువతి ఆత్మహత్యకు తాను కారణంకాదని, కావాలంటే తన ఫోన్ చాటింగ్ చూస్తే మీకే అర్థమవుతుందన్నారు. నాలుగేళ్లుగా ఆమె తనవెంట పడుతూ పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసిందని, తల్లిదండ్రులు వేరే సంబంధం చూసి పెళ్లి చేసుకోవాలని కొట్టడంతోనే ఆత్మహత్య చేసుకుందన్నారు. తనతో ఆమె చేసిన ఫోన్ చాటింగ్ చూసి తన మంచితనాన్ని ప్రజలకు తెలపాలని వీడియోలో వేడుకున్నాడు. కాగా వినయ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయంపై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా ఆత్మహత్యాయత్నం చేసుకున్నది నిజమే కానీ తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

నన్ను క్షమించండి..

సారీ అమ్మా.. సారీ డాడీ.. సారీ చెల్లి.. సారీ బావా..నాకు జరిగిన అవమానాన్ని భరించలేక ఈ తప్పుడు నిర్ణయం తీసుకుంటున్నాను. నన్ను క్షమించండి.. అంటూ తన కుటుంబ సభ్యులకు సంబంధించి ఓ వీడియోను విడుదల చేశాడు.

బెస్ట్ అవెలేబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: 2023-24 విద్యా సంవత్సరానికిగానూ జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో 3, 5,8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 18 నుంచి జూన్ 2 సాయంత్రం 5గంటల్లోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. జిల్లాకు 35 సీట్లు కేటాయించడం జరిగిందని, 3వ తరగతిలో 17 సీట్లు, 5వ తరగతిలో 9 సీట్లు, 8వ తరగతిలో 9 సీట్లు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే గిరిజన అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలకు మించరాదన్నారు. జూన్ 7న ఉదయం 11 గంటలకు లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు సంబంధిత తహసీల్దార్‌చే జారీ చేయబడిన కుల, ఆదాయ, బోనఫైడ్, నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.

మహిళ ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడకు చెందిన గుర్లె చిన్నుబాయి(50) కొంతకాలంగా మద్యానికి బానిసైంది. సోమవారం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు అర్జీలు సమర్పించారు. ఉట్నూర్ మండలం కొలాంగూడకు చెందిన లలిత ఏఎన్‌ఎం ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలం రాంపూర్ గ్రామస్తులు తమకు గిరి వికాసం పథకం కింద బోరుబావులు, విద్యుత్ మోటార్లను మంజూరు చేయాలని, లింగాపూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన పుర్క బాగుబాయి ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా కోసం, ఉట్నూర్ మండలం ఎంద గ్రామానికి చెందిన రాజేశ్వర్ పాల వ్యాపారానికి రుణం కోసం, వివిధ ప్రాంతాల ప్రజలు పింఛన్లు, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు కోసం దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో అదనపు వైద్యఆరోగ్య శాఖ అధికారి కుమురం బాలు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలి



ఎస్పీకి స్వాగతం పలుకుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

ఉట్నూర్‌రూరల్: వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. ఎస్పీకి ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐ సైదారావు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. సిబ్బంది మాట్లాడి నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సెంటర్ పరిశీలించి ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతీ ఒక్క ఫిర్యాదు దారుని పిటిషన్ వెంటనే నమోదు, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించినప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్న సర్కిల్ కార్యాలయాన్ని, ఉట్నూర్ రెండవ ఎస్సై కార్యాలయాన్ని రినోవేషన్ చేసి పునఃప్రారంభించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఇందులో ఉట్నూర్ ఎస్సై భరత్ సుమన్ ఉన్నారు.

ఎండ.. ప్రచండ





మంచిర్యాల జిల్లాలో రోజురోజుకూ ఎండలు ముదురుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది దాటిందంటేనే జనం బయటకు రావడానికి జంకుతున్నారు. అత్యవసర సమయాల్లో తలకు టోపీలు, చున్నీలను ధరించి బయటకు వస్తున్నారు. రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- సాక్షి, మంచిర్యాల ఫొటోగ్రాఫర్





